ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -88 పేజీలు - 08 వెల - 04/- గురువారం 9 జనవరి 2025

ప్రజల ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా..

చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా

రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి

విశాఖపట్నం,జనవరి8ఆంధ్ర ప్రగతి : ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు.ఏపీలో రూ. 2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని మోడీ అన్నారు

మిగతా 2లో



రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం... కేంద్రం కొత్త పథకం

మార్చి నెలలో దేశవ్యాప్తంగా ప్రారంభం

ప్రమాదం జరిగిన ఏడు రోజుల వరకు వైద్యం

వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

జనవరి8ఆంధ్ర ప్రగతి :

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందేలా చూడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఈ పథకం కింద రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యాన్ని పొందవచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఈ పథకం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన 7 రోజుల దాకా రూ. 1.5 లక్షల వరకు వైద్యాన్ని పొందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.మిగతాది 2లో...

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు

డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక పరుగులు

గత ఐదేళ్ల పాలనలో ఎపిలో విధ్వంసం

రైల్వేజోన్ సహా అనేక పరిశ్రమలకు శ్రీకారం

ముంబై తరహాలో ఆర్థిక నగరంగా విశాఖ అభివృద్ధి

ప్రపంచం మెచ్చే నాయకుడు ప్రధాని మోడీ



2లో

బలమైన భారత్ నిర్మాణమే మోడీ లక్ష్యం

మోడీ కారణంగా 2లక్షల కోట్ల అభివృద్ధి పనులు

విశాఖ సభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలుండవు..

- ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం
- ఇంటర్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకొచ్చిన ఏపీ ప్రభుత్వం
- ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలను మాత్రమే బోర్డు నిర్వహిస్తుందని వెల్లడి
- సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామన్న ప్రభుత్వం

అమరావతి, జనవరి8ఆంధ్ర ప్రగతి : ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏపీ ప్రభుత్వం సంస్కరణలను తీసుకొచ్చింది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవని వెల్లడించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపట్టినట్టు వెల్లడించారు.మిగతాది 2లో...

ఉచిత పథకాలకు డబ్బులు ఉంటాయి.. కానీ జడ్జిల జీతాలకు ఉండవా?

2లో

రాష్ట్ర ప్రభుత్వాలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ ఎన్నికల్లో గెలుపు కోసం రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న హామీలను ప్రస్తావించిన కోర్టు

జడ్జిల జీతాలు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలపై విచారం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు

ఆరు నెలలకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

మాజీ సిఎం జగన్ విమర్శల తూటాలు

అమరావతిజనవరి8ఆంధ్ర ప్రగతి : ఆరు నెలలకే కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత కనిపిస్తున్నదని మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ అన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులతో మాజీ సీఎం వైయస్ జగన్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో హామీలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబులా హామీలు ఇవ్వాలని కొందరు శ్రేయోభిలాషులు తనకు చెప్పారని.. రాజకీయాల్లో ఉన్నప్పుడు వ్యక్తిత్వం, విశ్వసనీయత ఉండాలన్నారు.. చంద్రబాబును నమ్మడమంటే..

నేడు కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేయనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

ఆరు నెలలకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

చంద్రముఖిని నిద్రలేపడమేనని.. పులినోట్లో తలకాయపెట్టడమేనన్నారు.. చంద్రబాబుకూ, జగన్‌కూ మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు.. కూటమి నాయకులు ఏ ఇంటికీ వెళ్లలేరని, వారికీ ఆ ధైర్యంకూడా లేదన్నారు.. మరోవైపు బాదుడే బాదుడు కనిపిస్తోందన్నారు.. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు.. నాయకులంతా యాక్టివ్‌గా ఉండాల్సిన సమయం వచ్చేసిందన్నారు.. తాను కూడా జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని.. ప్రతి వారం మూడు రోజులు ఒక పార్లమెంటులో విడిచేస్తానన్నారు.. ఇక, కార్యకర్తల విషయంలో ఇంతవరకూ ఒకలా చూశాం.. ఇకపై మరోలా చూస్తాం అంటూ వైఎస్ జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. మనంకూడా కొంత నేర్చుకోవాల్సి ఉంది.. జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ భరోసాగా ఉంటాం అని హామీ ఇచ్చారు.. అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం.. మీపై అన్యాయాలు చేసిన వారి పేర్లు గుర్తుపెట్టుకోండి.. వారిని చట్టంముందు కచ్చితంగా నిలబెడతామని హెచ్చరించారు.. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు.. అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు.. కచ్చితంగా కార్యకర్తలకు అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు వైఎస్ జగన్.. మనం ప్రతి మూడునెలలకూ విద్యాదీవెన కింద చెల్లించాం.. కానీ, ఇప్పుడు విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.3900 కోట్లు పెండింగ్‌లో పెట్టారు.. ఆరోగ్యశ్రీకింద వేయి ప్రొసీజర్లను 3300 వరకూ పెంచి గొప్పగా అమలు చేశాం.. 8 నెలల కాలంలోనే 3వేల కోట్లు ఆరోగ్యశ్రీకి బకాయిపెట్టారని మండిపడ్డారు.. ఇంటివద్దకే డోర్‌డెలివరీ పరిపాలన నుంచి తిరిగి టీడీపీ నాయకుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.. మనం ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.. నాయకులంతా యాక్టివ్‌గా ఉండాల్సిన సమయం వచ్చేసిందని సూచించారు వైసీపీ అధినేత వైఎస్ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..

ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలుఉండవు..

(మొదటి పేజి తరువాయి)

సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తామని కృతికా శుక్లా తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో ఎన్సీఈఆర్టీ పుస్తకాలను పెడుతున్నామని... దీనివల్ల నీట్, జేఈఈ వంటి జాతీయ పోటీ పరీక్షలకు సులభతరం అవుతుందని చెప్పారు. సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామని అన్నారు.సంస్కరణల్లో భాగంగానే ఇంటర్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలను తొలగించామని తెలిపారు. తొలి సంవత్సరం పరీక్షలను ఆయా కాలేజీలే అంతర్గతంగా నిర్వహిస్తాయని... ఇంటర్ సెకండియర్ పరీక్షలను మాత్రం ఇంటర్ బోర్డు నిర్వహిస్తుందని చెప్పారు. సంస్కరణలపై ఈ నెల 26 లోగా సలహాలు, సూచనలు పంపవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం...

(మొదటి పేజి తరువాయి)

అన్ని రకాల రోడ్లపై మోటారు వాహనాల కారణంగా జరిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుందని గడ్కరీ వివరించారు.రోడ్డు ప్రమాదం తర్వాత బాధితులకు అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్' సమయంలో వైద్య సహాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) ఈ స్కీమ్‌ను అమలు చేస్తుందని తెలిపారు. పోలీసులు, హాస్పిటల్స్, ప్రభుత్వ వైద్య సంస్థల సహకారం తీసుకోనున్నట్టు గడ్కరీ వెల్లడించారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఈ-డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈఏడీఆర్) అప్లికేషన్, ఎన్‌హెచ్ఏ ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఈ మూడింటితో అనుసంధానించిన ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ పథకం కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు వివరించారు.ఈ పథకం పైలట్ ప్రాజెక్టు 2024 మార్చి 14న చండీగఢ్‌లో ప్రారంభమైందని, ఆ తర్వాత ఆరు ఇతర రాష్ట్రాలకు విస్తరించామని గడ్కరీ వెల్లడించారు. దేశంలో ఏకంగా 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఉచిత పథకాలకు డబ్బులు ఉంటాయి.. కానీ జడ్జిల జీతాలకు ఉండవా?: సుప్రీంకోర్టు

న్యాయమూర్తుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూ ఉచిత పథకాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఉచితాలకు డబ్బులు ఉంటాయి కానీ జడ్జిల జీతాల చెల్లింపునకు మాత్రం ఉండవా?" అని నిలదీసింది. దేశంలోని న్యాయమూర్తులకు చాలీచాలని జీతాలు, పదవీ విరమణ అనంతరం అందుతున్న అరకొర ప్రయోజనాలపై విచారం వ్యక్తం చేస్తూ అఖిల భారత న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జడ్జిలు బీఆర్ గవాయ్, ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.ఇటీవలి జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రకటించిన 'లడ్కీ బెహన్' పథకం, ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ ప్రకటించిన 'మహిళా సమ్మాన్ యోజన', కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆర్థిక హామీలను ఈ సందర్భంగా ధర్మాసనం ప్రస్తావించింది. "జడ్జిలకు జీతాలు చెల్లించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తరచుగా ఆర్థిక పరిమితులను సూచిస్తుంటాయి. అయితే, ఎన్నికల సమయంలో మాత్రం 'లడ్కీ బెహన్' వంటి ఉచితాలు ప్రకటిస్తుంటారు. ఢిల్లీ ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు మహిళలకు రూ.2,100 లేదా రూ.2,500 చెల్లిస్తామంటూ ఆర్థిక వాగ్దానాలు చేయడం మనం చూశాం" అని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

'భారత్ పోల్' పోర్టల్‌ను ప్రారంభించిన అమిత్ షా ..

విదేశాలకు పారిపోయే నేరస్తులకు బిగ్ షాక్

జనవరి8ఆంధ్ర ప్రగతి :
దేశంలో పెద్ద ఎత్తున ఆర్థిక నేరాలకు పాల్పడి, ఇక్కడి దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా ఇతర దేశాలకు పరారై అక్కడ ఎంజాయ్ చేస్తున్న వారి ఆటలు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భాగంగా భారత్‌పోల్ పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ పోర్టల్‌ను మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. విదేశాలకు చెక్కేసిన నేరస్తులను దర్యాప్తు సంస్థలు భారత్ తిరిగి తీసుకువచ్చేందుకు 'భారత్‌పోల్' విభాగం దోహదపడుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి కేసుల దర్యాప్తును వేగవంతం చేసేందుకు 'భారత్‌పోల్' ను తీసుకొచ్చామని అమిత్ షా తెలిపారు. ఇప్పటి వరకు ఇంటర్‌పోల్‌తో భారత్ తరపున సీబీఐ మాత్రమే సమన్వయం చేసుకునేదని, ఇకపై భారత్‌పోల్ పోర్టల్ ద్వారా దేశానికి చెందిన ప్రతి దర్యాప్తు సంస్థ, అన్ని రాష్ట్రాల పోలీసులు నేరుగా ఇంటర్‌పోల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకు గానూ మూడు నేర చట్టాలపై రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను సీబీఐ తీసుకుంటుందని అమిత్ షా వెల్లడించారు. ఇకపై లెటర్లు, ఈమెయిల్స్, ఫ్యాక్సులు వంటి పాత తరహా కమ్యూనికేషన్ వ్యవస్థ స్థానాన్ని భారత్‌పోల్ పోర్టల్ భర్తీ చేస్తుంది. డిజిటల్ మాధ్యమంలో వేగంగా సమాచార బదిలీ జరుగుతుంది. సీబీఐ, ఇంటర్‌పోల్ మధ్య కమ్యూనికేషన్ గతం కంటే మెరుగవుతుంది.

నేడు కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేయనున్న
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

కర్నూలు, జనవరి8ఆంధ్ర ప్రగతి :
ఈ నెల 9వ (నేడు) తేదిన కర్నూలు జిల్లా పర్యటనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రానున్నారు.. 9 వ తేదీన ఉ.11 గం.లకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి ఉ.11:45 గం.లకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ఉ.11:50 గం.లకు హెలికాప్టర్ లో బయలుదేరి గణి సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్ ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి మ.12:30 గం.లకు అప్పర్ రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అప్పర్ రిజర్వాయర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.12:40 గం.లకు అప్పర్ ఇన్టేక్ వ్యూ పాయింట్ కు చేరుకుంటారు. మ.12:40గం.ల నుండి మ.1:15 గం.ల వరకు ప్రాజెక్ట్ ను పరిశీలించి, మ.1:15 గం.లకు అప్పర్ ఇన్టేక్ వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.1:25 గం.లకు పవర్ హౌస్ కు చేరుకుంటారు, అక్కడి నుంచి మ.1:40 గం.లకు రోడ్డు మార్గాన బయలుదేరి మ.1:45 గం.లకు టిఆర్సి వ్యూ పాయింట్ చేరుకుంటారు. మ.2 గం.లకు టిఆర్సి వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.2:15గం.లకు వసతి గృహం చేరుకుంటారు. మ.3:30గం.లకు గెస్ట్ హౌస్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి గెస్ట్ హౌస్ బి3 బ్లాక్ చేరుకుంటారు. మ.3:35గం.ల నుండి సా.4:05 గం.ల వరకు సంబంధిత అధికారులు ఉప ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ వివరాలను వివరిస్తారు. అనంతరం సా.4:05 గం.లకు బి3 బ్లాక్ నుండి అప్పర్ ఇంటెక్ వ్యూ పాయింట్ కు బయలుదేరి సా.4:20గం.లకు అక్కడికి చేరుకుంటారు. సా.4:25 గం.లకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సా.4:50గం.లకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. సా.4:55 గం.లకు కర్నూలు విమానాశ్రయం నుండి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు.

అభివృద్ధి లక్ష్యాలకు అండగా ఉంటా

(మొదటి పేజి తరువాయి)

ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.'నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం' అని ప్రధాని మోడీ వివరించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని

ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ. 'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వేజోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ అంతకుముందు విశాఖలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనికి భారీగా జనం హాజరై మోడీకి అభివాదం తెలిపారు. బహిరంగ సభలో ప్రధాన ప్రసంగాన్ని తెలుగులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అనువాదం చేసి అందించారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు

విశాఖపట్నం, జనవరి8ఆంధ్ర ప్రగతి :ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు పడిందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ఎపిలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అయితే గత ఐదేళ్ల విధ్వంస పాలనతో ఎపి ఎంతగానో నష్టపోయిందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విశాఖలో ప్రధాని సమక్షంలో అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన జరిగిన సందర్భంగా జరిగిన సభలో సిఎంచంద్రబాబు మాట్లాడారు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించింది. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుంది, దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారు. దిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుంది.. రాసి పెట్టుకోండి. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన.. మోదీ నినాదాలు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా ఉందో.. ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం' అని చంద్రబాబు వివరించారు. 'మోదీని స్ఫూర్తిగా తీసుకొని నిత్యం ముందుకెళ్తాం. త్వరలో అమరావతికి రావాలని ప్రధానిని కోరుతున్నా. నదుల అనుసంధానం మా లక్ష్యం.. అందుకు కేంద్రం సాయం కావాలి. మోదీ కార్యక్రమాల వల్ల దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానంలో ఉంటాం. రాష్ట్ర విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నాం.. ముందుకెళ్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసే బాధ్యత మాది. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి.. కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాది. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయి. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారు. ఏ సమస్య చెప్పినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారు. వెంటనే పనులు జరిగేలా చొరవ చూపిస్తారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతలా చొరవ చూపలేదు. మన దేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారు' అని చంద్రబాబు కొనియాడారు. అంతకుముందు ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అదిరిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం వస్తోందని చంద్రబాబు తెలిపారు. విశాఖ సభకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు.



సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడికెళ్లినా ప్రధాన మంత్రిపై ప్రజలు నమ్మకం చూపిస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ ప్రజలకు మోదీపై నమ్మకం, విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి చేతులమీదుగా రూ.2.08,545 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి సంఘటన తన జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..' విశాఖ రైల్వేజోన్ కల సాకారమైంది. రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాం. ఏడు రైల్వే ప్రాజెక్టులకు సైతం శంకుస్థాపనలు చేసుకున్నాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వస్తోంది. పూడిమడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఏపీ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజు. భవిష్యత్‌లోనూ మా కూటమి కొనసాగుతుంది. ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీఏనే. మేమంతా మోదీతోనే ఉంటాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. ప్రజలకు దగ్గరైన వ్యక్తి మోదీ. మా కాంబినేషన్ ఎప్పటికీ ఉంటుంది. ప్రధానిగా మోదీ ఉంటారు. ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ. దేశం కోసం పనిచేసే నాయకుడు మోదీ' అని చెప్పారు.గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, టీజీ భరత్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బలమైన భారత్ నిర్మాణమే మోడీ లక్ష్యం

విశాఖపట్నం,: ఏపీ ప్రజలు ఎన్‌డీఏను నమ్మారని అందుకే పట్టం కట్టారంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రైల్వే జోన్‌తో పాటూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ విశాఖకు విచ్చేశారు. ఆయనకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ధైర్య సాహసాలతో నింపితే అది పటిష్ట భారత్‌గా మారుతుందని, సదాశయంతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిస్తే.. అది స్వచ్ఛ భారత్ అవుతుందని తెలిపారు. సదుద్దేశం, సదాశయం ఉంటే ఏదైనా సాధ్యమేనని చెప్పారు. ప్రజలు ఏన్‌డీఏ ప్రభుత్వాన్ని నమ్మారని, అందుకే అండగా నిలబడ్డారని చెప్పారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రధాని మోదీ ఆశయమన్నారు. బలమైన భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని కొనియాడారు. మోదీ రాకతో ఏపీకి రూ.2.1 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, అలాగే 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడు మోదీ అంటూ కొనియాడారు. గత ఐదేళ్లలో అవినీతి, అరాచక పాలనతో ఏపీలో అంధకారం నెలకొందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దార్శనికులంటూ పవన్ కళ్యాణ్ కొనియాడారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 9 జనవరి 2025

28 వ జూనియర్ నేషనల్ షేపక్ తక్ర ఛాంపియన్ షిప్ పోటీలు

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 8: ఈ జాతీయ స్థాయి పోటీలు నంద్యాల శ్రీ రామకృష్ణ పీజీ కాలేజ్ కి సంబంధించిన శ్రీ కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియం లో ఈ నెల 28 వ తేదీ నుండి 2 వ తేదీ వరకు జరుగుతాయి. కావునా షేపక్ తక్ర గేమ్ ని ప్రాక్టీస్ చేస్తున్నటి వంటి విద్యార్థులు , షేపక్ తక్ర కోచ్ లు, అందరు కూడా ఈ ఈవెంటలో పాల్గొని నేషనల్స్ ని జయప్రదం చేయవలసింది గా కోరుతున్నాము. క్రీడాభారతి ఆధ్వర్యంలో జరుగుతున్న మొట్టమొదటి జాతీయ స్థాయి ఈవెంట్ కాబట్టి క్రీడాభారతి సభ్యులు, క్రీడాభిమానులు అందరూ కూడా ఈ కార్యక్రమానికి సహకరించి జయప్రదం చేయగలరు. ఈ రోజు జరిగిన బ్రోచర్ రిలీజ్ కార్యక్రమంలో క్రీడాభారతి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, క్రీడాభారతి నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రెటరీ నిమ్మకాయల సుధాకర్, షేపక్ తక్ర జాతీయ ఉపాధ్యక్ష్యులు శ్రీనివాసులు, నందికొట్కూరు క్రీడాభారతి ప్రెసిడెంట్ శ్రీధర్ మిగితా క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

రూలర్ తాసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవానికి

ఎమ్మెల్సీ ఇసాక్ భాషను ఆహ్వానించకపోవడం అవమానపరచడమే.

-అవ్వాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జనవరి 08:

శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్సీ, ఇసాక్ బాషా ఎమ్మెల్యేల ప్రతినిధులతో ఎన్నుకోబడినారు కావున నంద్యాల జిల్లాలో ఏ ప్రభుత్వ కార్యాలయం ప్రారంభించిన ఆహ్వానించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉన్నది. ఆహ్వానించని అధికారులకు శాసనమండలిలో ఎం ల్ సి ఇస్సాక్ బాషా పిర్యాదు చేసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయాలి. అలాగే శాసనమండలి సభ్యుల హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుంది. కావున ప్రివిలేజ్ కమిటీకి తెలియజేస్తానని ఇసాక్ భాషా ఆగ్రహ వ్యక్తం చేయడము సరైనదేనని సిపిఎం మాజీ నాయకులు ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి తెలియజేస్తూ రెవెన్యూ అధికారుల వైఖరిని ఖండించారు.ఎవరు అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్సీ, ఎంపీలను,మండల అధ్యక్షులను ఆహ్వానించాలి.రాత్రికి రాత్రి తాసిల్దార్ మార్పులు జరిగితే ఈ విధంగానే ఉంటుంది. ఇప్పటికైనా అటువంటి తప్పులు జరగకుండా మంత్రి ఫరూక్ నిర్ణయాలు తీసుకోవాలి. ఆలాగే కేరళలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి పర్యటన చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులను వెంటబెట్టుకొని పర్యటించారు అలాగే తమిళనాడులో కూడా జరిగినది. రెవెన్యూ అధికారులు ఎమ్మెల్సీ ఇషక్ భాషను అవమానపరచడానికి చేసినారా లేక వారి అవినీతి అక్రమాలు ఆహ్వానించలేదా మీడియా ద్వారా తెలియజేయాలి. అని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

-బేడ బుడగ జంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గ రాముడు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల అర్బన్ జనవరి 08:

నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు శ్రీనిధి హోటల్ దగ్గర ఉదయం నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పై మున్సిపల్ కాంట్రాక్టర్ చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బేడ బుడగ జంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గ రాముడు అన్నారు.ఈ సందర్భంగా స్థానిక వైయస్సార్ నగర్ లో ఉన్న టిడిపి కార్యాలయంలో తాటికొండ బుగ్గ రాముడు మాట్లాడుతూ ఈరోజు నంద్యాలలో మున్సిపల్ కమిషనర్ పై దాడి జరిగిందని సోషల్ మీడియాలో వార్తలు రావడంతో దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి ఘటనలు వల్ల పునరావృతం అయితే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని ఎవరైతే ఈ పనిని చేశారో వారు బేసరత్తుగా మున్సిపల్ కమిషనర్ కి క్షమాపణ చెప్పాలని అన్నారు. పోలీస్ అధికారులు కూడా ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని , ఇలా జరిగినప్పుడు వెంటనే స్పందించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డే నాగేంద్ర , హిమాం హుస్సేన్ , దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పై అవగాహన సదస్సు.

ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 08: రీ సర్వేపై అవగాహన సదస్సును మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో తహసిల్దార్ రమాదేవి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తమ వ్యవసాయ భూములను రీ సర్వేలో సరిదిద్దుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే రీ సర్వేలో పరిష్కరిస్తామన్నారు. రైతులందరూ సంయుక్తంగా రీ సర్వే జరిగే కార్యక్రమంలో పాలుపంచుకొని సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కామేశ్వర్ రెడ్డి ఆర్ ఐ సుబ్బారావు, మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు జనార్దన్ రెడ్డి, వీఆర్వో తో పాటు పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

-అవసరమైన, అర్హత గల వ్యక్తులకు మాత్రమే రుణాలు మంజూరు చేయండి.
-బ్యాంకర్లను సూచించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 08:

జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బ్యాంకర్లను సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బీసీల స్వయం సమృద్ధి రుణాల మంజూరుపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, యూబీఐ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేంద్ర గౌడ్, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ మనోహర్, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ సుందర రాము తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిసి, ఈ బీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను సూచించారు. జిల్లాలో 2156 మంది బీసీలకు 45.84 కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద రుణాలను అందించాలన్నారు. అలాగే ఈబీసీ వర్గాల 73 యూనిట్లకు 1.27 కోట్లు , కమ్మ కార్పొరేషన్ క్రింద 15 యూనిట్లకు 26 లక్షలు, రెడ్డి కార్పొరేషన్ కింద 45 యూనిట్లకు 78 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 26 యూనిట్లకు 45 లక్షలు, బ్రాహ్మిన్ కార్పొరేషన్ కింద్ 10 యూనిట్లకు 17 లక్షల మేర స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వీటన్నింటినీ పరిశీలించి అవసరమైన, అర్హత గల వ్యక్తులకు మాత్రమే రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాల మంజూరులో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఖచ్చితమైన లబ్ధిదారులకే మంజూరు చేసేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. 21 నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న బీసీ వర్గాల వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్లో ఏపీఓబిఎంఎంఎస్ వెబ్సైట్లో ఈనెల16వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసి జిల్లాను టాప్ ఫైవ్ లో ఉంచాలన్నారు. లక్ష్యానికి మించి దరఖాస్తులు వస్తే స్క్రూటినీ చేసి అర్హత గల వ్యక్తులకే రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.
మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా పాదయాత్ర ద్వారా శ్రీశైలం వెళ్లే భక్తుల దారుల్లో గిరిజనులు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లను సూచించారు. గత సంవత్సరం 30 యూనిట్లకు రుణాలు ఇచ్చారని ఈ విడత మరింత ఎక్కువ మందికి రుణాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని బ్యాంకర్లను సూచించారు.

విజయ పాల డైరీ లోని అక్రమాలను వెలితిస్తాననే సభ్యత్వం రద్దు చేశారు

-ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 08:

చాగలమర్రి మండలం చక్రవర్తుల పల్లెలో విజయ పాల డైరీ కి ఐదు సంవత్సరాలుగా నేను నామినేషన్ వేస్తున్నాను ఇన్ని రోజులు చూపించని బకాయిలు ఈరోజు ఎందుకు చూపిస్తున్నారు ఏదైనా బకాయిలు ఉంటే పేపర్లు తీసుకొని వచ్చి ఎందుకు చూపించలేకపోతున్నాడు అంటున్న భూమా విఖ్యాత్ రెడ్డి గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని అడ్డుపెట్టుకొని రెండు సంవత్సరాలు ప్రెసిడెంట్ గా లేకున్నా కూడా అధికార యంత్రాంగం అంతా అడ్డుపెట్టుకొని చైర్మన్ అవడం జరిగింది ఇవన్నీ నేను బయట పెడతానని ఉద్దేశంతో ఈరోజు బకాయి ఉందంటూనారు. సొసైటీ రద్దు అవ్వదు మేము కోర్టుకు వెళ్లడం జరిగింది. అలాగే నాకు బకాయిలు ఉంటే ఇన్ని రోజులు ఎస్.వి జగన్మోహన్‌రెడ్డి ఏం చేస్తున్నాడు అని అడుగుతున్న భూమా విఖ్యాత్ రెడ్డి. నాకు మూడు నోటీసులు ఇచ్చారంటున్నారు. ఇచ్చినట్టు ఏదైనా ప్రూఫ్ ఉంటే చూపించండి నేను బకాయి ఉన్నానంటే చక్రవర్తుల పల్లె నుంచి రాజీనామా చేయడానికి అయినా రెడీ అంటున్నా భూమా విఖ్యాత్ రెడ్డి.కొన్ని రోజుల కింద బోర్డు మీటింగ్ పెట్టారు డైరెక్టర్లకు ఎటువంటి ఇన్ఫర్మేషన్ లేదు నాకు కూడా ఇటువంటి ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా సభ్యత్వం రద్దు చేశామని చెబుతున్నారు, దీనిపై మేము న్యాయస్థానానికి వెళ్లడం జరిగింది కచ్చితంగా తీర్పు మా వైపే ఉంటుందంటున్న భూమా విఖ్యాత్ రెడ్డి. డైరెక్టర్ల మీటింగ్ జరిగితే అది నంద్యాల లోనైనా జరగాలి లేకుంటే కర్నూల్ లో అయినా జరగాలికాని, ఈ రెండు చోట్ల లేకుండా చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి ఇంట్లో డైరెక్టర్ల మీటింగ్ పెట్టుకోవడం జరిగింది.
మా తరపున నలుగురు డైరెక్టర్లు ఉన్న వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మీటింగ్ ఎలా జరిపారని ఈరోజు పాల డైరీ కి రావడం జరిగింది. ఎండి ని అడగగా నా చేతుల్లో ఏమీ లేదు అంతా చైర్మన్ చేతులెత్తేశాడు.విజయ పాల డైరీలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. కొంతమంది డైరెక్టర్లకు నేను చెబుతున్నాను. ఈ జగన్మోహన్ రెడ్డి వెనుక ఉన్నవారందరికీ ఈ అవకతవకల్లో బాగా ఉందని నేను అనుకుంటున్నాను. జగన్మోహన్ రెడ్డి ఎంత ఇబ్బంది పడతారో మీరందరూ కూడా అంత ఇబ్బంది పడతారు అని తెలిపిన భూమా విఖ్యాత్ రెడ్డి.

స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలి..

అదాని తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి.-సిపిఎం డిమాండ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 08:

వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన నియంత్రణ మండలి ప్రభుత్వం,పంపిణీ సంస్థల ప్రతిపాదనలను గుడ్డిగా ఆమోదించడం, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోపోవటం బాధాకరమని,ఇప్పటికైనా గతంలో వేసిన భారాలు రద్దు చేయాలని, కొత్త భారాలు వేయవద్దని,స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని, అదానీ సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరుతున్నామని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈఆర్సి కి ఫిర్యాదు చేయాలని కోరుతూ విద్యుత్ ఏఈ సుబ్బారావు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, సీనియర్ నాయకులు తోట మద్దులు, వీటితో పాటు పార్టీ కార్యకర్తలు 10మంది పాల్గొనడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దోచిపెట్టండి అని చెప్పిందే వేదంగా భావించి ఆదాని సంస్థ అయినా సేకితో విద్యుత్ ఒప్పందాలను కుదుర్చుకుని రాష్ట్ర ప్రజల పైన విద్యుత్ చార్జీల భారాన్ని ట్రూ అప్ చార్జిల, సర్ చార్జీల పేరుతో లక్ష కోట్లకు పైగా భారాన్ని వేయడం తగదని, గతంలో వైసిపి చేసిన ఒప్పందాల వలనే ప్రజల పైన భారాలు పడుతున్నాయని, వైసిపి పై నెట్టి వేయడం తగదని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు నిజంగా కోరితే తమిళనాడు ప్రభుత్వం మాదిరిగా ఆదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ఇప్పటికే పెరుగుతున్న బారాలను ప్రజలు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు చందంగా మళ్లీ విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజల పైన వేయడం సరైనది కాదని అన్నారు. విద్యుత్ నియంత్రణ మండలికి సిపిఐ(యం) తెలిపిన అభ్యంతరాలు అభిప్రాయాలు ముఖ్యమైనవి ఈ క్రింది విధంగా ఉన్నాయని తెలిపారు. 2025-26 సంవత్సరంలో భారాలు లేవంటూనే సర్దుబాటు చార్జీల ద్వారా వేలాది కోట్ల రూపాయల భారం ముందుగానే మోపారు.భవిష్యత్తులో కూడా మరింతగా మోపటానికి సిద్ధమవుతున్నారు.పంపిణీ సంస్థలు విద్యుత్ మిగులు, భవిష్యత్తు అవసరాలపై తప్పులు తడకలతో అంచనాలు రూపొందిస్తున్నారు. 2024 -25 సంవత్సరంలో సంస్థల ప్రతిపాదనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అనుభవం తెలుపుతున్నది.బడా కంపెనీలకు మేలు చేసే విధంగా ప్రైవేట్ సంస్థల నుండి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు అంచనాలు రూపొందిస్తున్నారు.ప్రభుత్వం చెల్లించవలసిన సబ్సిడీలను కుదించి చూపి భవిష్యత్తులో సర్దుబాటు చార్జీలపై భారం మోపటానికి వాస్తవ విరుద్ధ ప్రతిపాదనలు ప్రజల ముందు ఉంచుతున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, కార్పొరేట్లకు మేలు చేసే చర్యల వలన ప్రజలపై విద్యుత్ భారాలు పడుతున్నాయి.రెన్యువబుల్ ఎనర్జీ పేరుతో అధిక రేట్లతో అవసరానికి మించి విద్యుత్ కొనుగోలు చేయటం వల్ల వేలాది కోట్ల రూపాయల భారం పడుతున్నది. ఈ భారాలను ప్రజల పైన వేయకుండా ప్రభుత్వం వెంటనే అన్ని ఒప్పందాలను రద్దు చేసుకొని ప్రజల పైన ఉన్న చిత్తశుద్ధిని నేర్పించుకోవాలని లేకుంటే ప్రజల తిరుగుబాటుకు ప్రభుత్వం రుచి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

ఉమూమి తబ్లిగీ ఇస్తేమా ను సందర్శించిన మంత్రి , కలెక్టర్, ఎమ్మెల్యే

ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జనవరి 08:
నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో ఏర్పాటుచేసిన ఉమూమి తబ్లిగీ ఇస్తేమా రెండో రోజుకు చేరుకుంది .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి , నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఐ.పీ.ఎస్ ముఖ్య అతిథులుగా హాజరై ఇస్తేమాను సందర్శించారు. అనంతరం అక్కడ సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఇస్తేమాకు ప్రజలు ఎక్కడెక్కడ నుంచి వచ్చారు అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడతా మత పెద్దలతో సమావేశమై కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం ప్రారంభమైన ఇస్తేమా కార్యక్రమం గురువారం సాయంత్రం తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఏ ప్రాంతాలకు చెందినవారు పాల్గొన్నారు అనే విషయాలపై మత పెద్దలతో అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఇక్కడ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా.ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ముగుస్తున్నందున వెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా అందరూ వెళ్లేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందే ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక ద్వారా పంపించాలన్నారు. అక్కడ నిర్వహించే ఇస్తేమా గురించి మత పెద్దలతో చర్చించి విషయాలు తెలుసుకున్నారు. ఏదైనా అవసరం ఉంటే వెంటనే సంబంధిత అధికారికి తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు అలాగే అందరూ అధికారులు మీకు ఎల్లవేళలా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.
అనంతరం మత పెద్దలు మంత్రి, కలెక్టర్ ఎమ్మెల్యే , జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , ఆర్డిఓ , ఎమ్మార్వో , డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ అధికారిని , ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

19న విజయవాడలో గిరిజన ఆదివాసి సమ్మేళనసభ

ఆంధ్ర ప్రగతి పాణ్యం జనవరి 08:
పాణ్యం చెంచు కాలనీలో గోడపత్రికలు ఆవిష్కరించిన ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, పాణ్యం మాజీ జెడ్పిటిసి నారాయణమ్మ, ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగశేషుడు, టిడిపి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శేషా నాయక్ ఈనెల 19వ తేదీన గిరిజన ఆదివాసి సమ్మేళన సభ విజయవాడ వేదికగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు.బుధవారం పాణ్యం మండలంలోని చెంచు కాలనీలో ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగశేషుడు, మాజీ జెడ్పిటిసి నారాయణమ్మ అధ్యక్షతన కాలనీలో రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ సమావేశం నిర్వహించారు. అనంతరం చెంచు గిరిజనులతో కలిసి గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే గిరిజన ఆదివాసి సమ్మేళన సభ జయప్రదం చేయాలని ఆయన గిరిజనులకు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు, సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కేరళ ఐజి లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ మరియు ప్రముఖ నేతలు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో గిరిజన కళాబృందం చే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణం స్థాయిని పెంచే లక్ష్యంతో గిరిజనుల ఆత్మగౌరవానికై జరిగే గిరిజన ఆదివాసి సమ్మేళన సభకు వేలాదిగా గిరిజన ఆదివాసిలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

సీఎం చంద్రబాబు సెక్యూరిటీలో మార్పు..?
-రంగంలోకి యాక్షన్ టీం.?

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 08:
సీఎం చంద్రబాబు భద్రతలో మార్పులు జరిగాయి. మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉన్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. నిఘా హెచ్చరికలతో స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్‌లో మార్పులు-చేర్పులు చేస్తున్నారు. సీఎం భద్రతా వలయంలోకి కౌంటర్ యాక్షన్ టీమ్స్‌ను దింపుతున్నారు. ఎన్ఎస్‌జీ, ఎస్ఎస్‌జీ, స్థానిక సాయుధ బలగాలకు అదనంగా.. ఆరుగురు కమాండోలతో కౌంటర్ యాక్షన్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎస్పీజీ ఆధ్వర్యం లో కౌంటర్ యాక్షన్ టీమ్‌కు శిక్షణ ఇస్తున్నారు. చంద్రబాబుకు మూడంచెల భద్రత కల్పిస్తారు.. ఎన్ఎస్‌జీ తొలి, ఎస్ఎస్‌జీ రెండు వలయాల్లో సెక్యూరిటీని కల్పిస్తాయి. మూడో వలయంగా సీఎం పర్యటన లకు వెళ్లినప్పుడు అక్కడి పోలీసు యూనిట్లకు చెంది న సాయుధ బలగాలు భద్రతను ఇస్తాయి. వీరితో పాటుగా ఇప్పుడు కొత్తగా ముఖ్యమంత్రి సమీపంలో ఆరుగురు కౌంటర్ యాక్షన్ కమాండోలు సెక్యూరిటీగా ఉంటారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే.. ఎన్ఎస్‌జీ, ఎస్ఎస్‌జీ ముఖ్యమంత్రిని రక్షించి సురక్షితంగా ఉండే ప్రాంతానికి తీసుకెళతారు. ఈలోపు కౌంటర్ యాక్షన్ టీమ్ బయటి నుంచి దాడి చేసే వారినిఎదుర్కొం టుంది. ప్రధానమంత్రి భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్,ఈ కౌంటర్ యాక్షన్ కమాండో లకు శిక్షణను ఇచ్చాయి. దేశంలో బ్లాక్ క్యాట్ కమాండోలు, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న అతికొద్ది మంది వ్యక్తుల్లో చంద్ర బాబు ఒకరు. తిరుపతిలోని అలిపిరి వద్ద ఆయనపై నక్సల్స్ దాడి చేసిన తర్వాత ఆయనకు ఎన్ఎస్‌జీ బ్లాక్ క్యాట్ కమాండోలు వచ్చారు. ఈ బ్లాక్ క్యాట్ కమాండోలతో పాటు చంద్రబాబుకు భద్రతా వలయం కూడా ఎప్పుడూ కూడా కట్టుదిట్టంగా ఉంటుంది.

అంగన్వాడి టీచర్ పై దాడి చేసిన శివకుమారు పై నాన్ బేలబుల్ కేసు నమోదు చేయాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 08:
తమ్ము రాజు పల్లె అంగన్వాడి టీచర్ జయలక్ష్మి పై హత్య యత్నం చేసి గోరాతి ఘోరంగా కొట్టి హింసించిన శివకుమార్ పై నాన్బెలబుల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి ఏసురత్నం ఏ నాగరాజు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నిర్మలమ్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మందులు జిల్లా నాయకురాలు సునీత నాగరాణిలు జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి గవర్నమెంట్ హాస్పటల్ మీదుగా సాయిబాబా నగర్ వరకు వ్యాలీ నిర్వహించి సాయిబాబా నగర్ సెంటర్లో నిరసన తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ రాజు పల్లె అంగన్వాడీ టీచర్ జయలక్ష్మి 15 సంవత్సరాల నుండి ఏ చిన్న పొరపాటు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుందన ఆమెపై కచ్చ కటి ఆ గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి స్థానిక అంగన్వాడి సెంటర్లో విధులు నిర్వహిస్తున్న జయలక్ష్మి పైన విచక్షణ రహితంగా దాడి చేసి కంటి పై ఆయుధంతో బలంగా కొట్టడం వల్ల కన్ను చూపు పోయే ప్రమాదం ఉందని అలాగే విచక్షణ రహితంగా కిందపడేసి కొట్టి ఈడ్చుకుంటూ భయభ్రాంతులకు గురి చేసినటువంటి శివకుమార్ పైన కఠినాతి కఠినంగా శిక్షించాలని డ్యూటీలో ఉన్న ఒక మహిళ ఉద్యోగి పైన ఇలాంటి చర్యకు పాల్పడిన ఈడిగా శివకుమార్ పైన నాన్ బేలబుల్ కేసు నమోదు చేసి కఠినాతి కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకొని మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని వాళ్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు బుజ్జమ్మ, సారమ్మ, వరలక్ష్మి, రాధాకృష్ణ వేణి, వెంకటమ్మ, అనురాధ, నిర్మల, సబిర, లక్ష్మీ కొండమ్మ, నీలిమ, కళావతి తోపాటు 100 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ను విమర్శిస్తే సహించం..!

-గురివింద గింజల చందనా రోజా,వైసీపీ నేతల తీరు. -జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో- కన్వీనర్ పెంటేల బాలాజి.

ఆంధ్ర ప్రగతి చిలకలూరిపేట డిసెంబర్ 08:
సామాన్యుని స్వరం తన గళంగా.. సమస్యల సాధన తన ధ్యేయంగా మార్చుకొని జనరంజక పాలన కొనసాగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై రోజా, వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి వెళ్తున్న ఇద్దరు మెగా అభిమానులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని,. కాకినాడ-రాజమహేంద్రవరం మధ్య జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించారని తెలిపారు. ఈ సంఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారని, ఇళ్లకు సురక్షితంగా వెళ్లండి అని ఆరోజు వేదుకలో ఒకటికి, రెండుసార్లు చెప్పారని తెలిపారు. . జనసేన పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఆర్థికసాయం ప్రకటించి, మృతుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. మృతుల కుటుంబాలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరామర్శించారని వెల్లడించారు. గురివింద గింజ తన కింద నలుపెరగదు అన్న చందంగా రోజా ,వైసీపీనేతలు వ్యవహరిస్తున్నారని, శవరాజకీయాలకు తెరతీశారని బాలాజి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువురు మెగా అభిమానులు మృత్యువాత పడటానికి ప్రధాన కారణం రోడ్ల దుస్థితిని పేర్కొన్నారు. నాడు రోడ్ల నిర్వహణను గాలికి వదిలివేయడం వల్లనే రాష్ట్రంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించారు. తప్పు తాము చేసి, నెపం కూటమి ప్రభుత్వంపై, పవన్ కళ్యాణ్‌పై నెట్టడానికి ప్రయత్నించటం అవివేకమన్నారు. గతం నుంచి ప్రతి చిన్న విషయంపై రోజా పవన్‌పై విరుచుకుపడుతున్నారని , తన ఉనికి కాపాడుకోవడం కోసం పవన్ కళ్యాణ్‌పై అర్థం లేని విమర్శలకు దిగుతున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తే జనసైనికులు చూస్తూ ఊరుకోరని చెప్పారు. ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మక విమర్శలు ఆరోగ్యకరమని, %౫% దూషించడం, హత్యలు, అత్యాచార బెదిరింపులు సరికాదని గతంలోనే పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఇక నైనా వైసీపీ నేతలు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ప్రజా సంక్షేమాభివృద్ధికి సూచనలు, సలహాలు అందజేయాలని, అర్థం లేని విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు.

ఘనంగా ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ దశమ వార్షికోత్సవం

-ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జనవరి 08:
నంద్యాల పట్టణ శివారులోని ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆర్జీఎం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత మిద్దె శాంతి రాముడు ఏర్పాటు చేసిన మెగా ఈవెంట్ లో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , మాజీ జెడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అన్ని రంగాలలో రాణించాలని వారు చదువుతున్న స్కూల్ కి మరియు వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు అలాగే విద్యతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమైనవని వాటిలో కూడా తమ ప్రతిభ చూపించాలని కోరారు. ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా యాజమాన్యానికి విద్యార్థిని విద్యార్థి తల్లిదండ్రులకు స్కూల్ స్టాఫ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ చూపించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో ఆర్జీఎం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఎండి మిద్దె శివరాం, మిద్దె రఘురాం, ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ హెచ్ఎం , తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు... సలహాలు, సూచనలకు ఆహ్వానం పలికిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, జనవరి 08, ఆంధ్ర ప్రగతి :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో సమగ్రమైన మార్పులకు, సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభివృద్ధిని, భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థకు కొత్త రూపు ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో... తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా రంగ నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి, ఈ సమాచారం ఆధారంగా కొన్ని కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది.
పాఠ్య ప్రణాళిక మరియు పాఠ్య పుస్తకాల పునర్విమర్శ: ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్న త్వరితగతి మార్పుల నేపథ్యంలో, పాఠ్య ప్రణాళికను నవీకరించడం అత్యంత అవసరం. కొత్త పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు తాజా సమాచారం మరియు నైపుణ్యాలను అందిస్తాయి.
కొత్త సబ్జెక్ట్ కాంబినేషన్లు: విద్యార్థులకు వారి ఆసక్తులకు అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకునే స్వేచ్ఛను ఇవ్వడం మంచి నిర్ణయం. ఇది వారిలో సృజనాత్మకతను పెంపొందిస్తుంది.పరీక్ష మార్కుల నమూనాలో మార్పులు: రొటీన్ అభ్యాసాన్ని తగ్గించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం మంచి విషయం.
ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర బోర్డు పరీక్షలను తొలగించడం: విద్యార్థులపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి ఇది మంచి నిర్ణయం.
ఇంటర్మీడియట్ విద్యా సంస్కరణలు రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈ సంస్కరణలు విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయని, అయితే, ఈ సంస్కరణలు విజయవంతం కావాలంటే, అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం అని రాష్ట్ర విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో తాజా ప్రతిపాదనలపై సలహాలు, సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానిస్తోంది.
ఈ సంస్కరణల గురించి మీ అభిప్రాయాలను biereforms@gmail.com కు పంపవచ్చు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 9 జనవరి 2025

ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో

అడవి బిడ్డలకు విద్యుత్ వెలుగులు

-45 ఏళ్ల తర్వాత చెంచు గూడెంలలో చీకటిని తరిమిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జనవరి 08:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు వెలుగులు ప్రసాధించేందుకు, శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం శ్రీశైలం బ్యాక్ వాటర్ లో ముంపుకు గురై జన్మభూమిపై మమకారంతో ఏట్లో గ్రామాలు మునిగిపోయిన ఏటి ఒడ్డున (కృష్ణానది ఒడ్డున) ఎత్తైన నల్లమల అరణ్యంలో రోడ్డు మార్గం లేకున్నా చిమ్మ చీకటి కమ్ముకున్నా ఏట్లో చేపలు పట్టుకొని వాటిని అమ్మి 1980 నుంచి చీకటి జీవనం కొనసాగిస్తున్న అడవి బిడ్డలకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆశా జ్యోతిలా నిలబడ్డారు. నంద్యాల జిల్లా కేంద్రానికి 110 కిలోమీటర్లు దూరం, కృష్ణానది ఒడ్డున నల్లమల అరణ్యంలో క్రూర మృగాలు, విషసర్పాల మధ్య కనీసవసతులు కరువై జీవిస్తున్న అడవి బిడ్డలు (గిరిజనతెగ) చెంచులకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విద్యుత్ వెలుగులు అందించారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సిద్దేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప చెంచుగూడెంలకు తారురోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 4.40 కోట్లు మంజూరు చేయించారు. అడవిలో 7.10 కిలోమీటర్లు దూరం తారురోడ్డు నిర్మాణం, సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు 11 కిలోమీటర్ల దూరం రోడ్డు వెంట, గూడెంలలో అంతర్గతంగా వేసేందుకు 287 విద్యుత్ స్థంబాలు, 4 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు, చెంచు గూడెంలలో వీధిదీపాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నిధులు మంజూరు చేయించారు. ప్రధాన మంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడు చెంచుగూడెంలలో విద్యుత్ సరఫరా, గిరిజనుల ఇళ్లకు ఉచిత కరెంట్ కనెక్షన్, గూడెంలలో అంతర్గత వీధిదీపాల ఏర్పాటుకు మరో కోటి యాభై లక్షల రూపాయలు ఎంపీ శబరి మంజూరు చేయించారు. కరెంటు లోఓల్టేజి సమస్య పరిష్కారం కోసం మండల కేంద్రమైన కొత్తపల్లిలో 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్, శివపురం గ్రామంలో 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్, మంజూరు చేయించారు. ఈ విద్యుత్ సరఫరా మంజూరు వల్ల సిద్దేశ్వరం చెంచుగూడెంలో 40 కుటుంబాలు, బలపాలతిప్ప గూడెంలో 30 కుటుంబాలు, జానాలగూడెంలో 60 కుటుంబాలు, మొత్తం 130 చెంచుకుటుంబాల ఇళ్లకు కరెంటు సరఫరా జరిగింది. తారురోడ్డు, విద్యుత్ సరఫరా పనులు ప్రభుత్వ అధికారులు మొదలు పెట్టారు. విద్యుత్ పనులు శరవేగంగా పూర్తి చేసి చెంచు గూడెంలకు విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసేందుకు సిద్ధంగా ఉన్నారు.జానాలగూడెం వాసులు తిక్కస్వామి, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు లేక అడవిలో కాలినడకన గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు 11 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారమని, అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే బుట్టలు, మరపడవల్లో తెలంగాణ వైపు సోమశిలకు గాని, ఇటు ఏట్లోనే ముచ్చుమర్రి, కపిలేశ్వరం ఒడ్డుకు వెళ్లి వైద్యం చేయించుకునేవారమని, రేషన్ బియ్యం కోసం బుట్టల్లో కపిలేశ్వరం ఒడ్డుకు వెళ్లి డీలర్ వద్ద రేషన్, ఇతర నిత్యావసరం వస్తువులు తెచ్చుకునేవారమని వివరించారు. పలుమార్లు మా కష్టాలు తెలుసుకునేందుకు మా గూడెంలకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మీ చెంచుగూడెంల ప్రజల కష్టాలకు పరిష్కారం లభిస్తుందని చెప్పేవారని, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కూతురే ఎంపీ గా రావడం, మా చెంచుగూడెంలకు ప్రధాన రహదారి, కరెంట్ సరఫరాకు ఏకంగా రూ. 6 కోట్లు మంజూరు చేయించి కరెంటు పనులు పూర్తి అయ్యాయని, ఆరు నెలల్లో తారుతో ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి అవుతుందని అధికారులు చెప్పారన్నారు.
అయితే మా గూడెంలలో ప్రధాన సమస్య సాగుభూమి సమస్య అని, 40 ఏళ్లుగా ఏట్లో (కృష్ణానదిలో) నీరు తగ్గాక పంటలు సాగుచేసుకొని గ్రామాలను నమ్ముకొని జీవించేవారమని. గత వైసీపీ పాలనలో కొందరు స్వార్థపరుల కారణంగా భూములు సాగుచేసుకోకుండా అడ్డుకోవడంతో సాగుభూముల్లో ముళ్ల చెట్లు పెరిగి అడవిలా తయారు అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్, ఎంపీ బైరెడ్డి శబరమ్మలు మా సాగుభూముల సమస్య పరిష్కారం చేస్తారన్న నమ్మకాన్ని తిక్కస్వామి, వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసులు అసలు సమస్యే కాదు

ఫార్ములా కేసులో పైసా అవినీతి లేదు
న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా
రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి
బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు

హైదరాబాద్,జనవరి8ఆంధ్ర ప్రగతి :
కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మెత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ'2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు దిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు.
ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయించామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. దిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

పుష్పలో అదనపు సన్నివేశాల విడుదల

సాంకేతిక కారణాలతో 17కు వాయిదా



హైదరాబాద్,జనవరి8ఆంధ్ర ప్రగతి : కొన్ని అదనపు సన్నివేశాలతో కూడిన 'పుష్ప 2' రీలోడెడ్ వెర్షన్‌ను విడుదల చేయాల్సి ఉన్నా...అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు చిత్ర బృందం వెల్లడించింది. సంబంధిత కంటెంట్ విషయంలో సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతోందని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఈ నెల 17 నుంచి కొత్త సన్నివేశాలతో కూడిన సినిమాని చూడొచ్చని పేర్కొంది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న చిత్రానికి అదనంగా 20 నిమిషాల నిడివి గల సన్నివేశాలను జోడిస్తున్నామని, ఈ నెల 11 నుంచి చూడొచ్చని మంగళవారం ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'పుష్ప 2' నిడివి 3 గంటల 20 నిమిషాల 38 సెకన్లు ఉండగా.. దానికి ఇంకా 20 నిమిషాల సీన్స్ యాడ్ చేస్తే, 3 గంటల 40 నిమిషాలు దాటిపోతుంది. అంటే ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు 4 గంటల పాటు 'పుష్ప' ప్రపంచంలో ప్రేక్షకుడు ఉంటాడు. మరోవైపు, ఈ చిత్రం ఇప్పటికే సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో రెండో స్థానంలో, తెలుగు సినిమాల లిస్ట్‌లో ప్రథమ స్థానంలోకి వచ్చింది. 'దంగల్' (రూ. 2 వేల కోట్లకుపైగా) తర్వాత ఇప్పటి వరకూ రెండో ప్లేస్‌లో ఉన్న 'బాహుబలి 2' (రూ.1810 కోట్లు)ను రికార్డును బ్రేక్ చేసింది. 32 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.1831 కోట్లు (గ్రాస్) రాబట్టింది.

హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి

ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ

ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జనవరి8ఆంధ్ర ప్రగతి :దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. దిల్లీలో మత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రాల వద్ద తోపులాట.. ఆరుగురు మృతి

తిరుమలజనవరి8ఆంధ్ర ప్రగతి :
తిరుమలలో ఈ నెల 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ దర్శనాల కోసం తిరుపతి, తిరుమలలో రేపటి నుంచి టోకెన్ల జారీకి టీటీడీ ఏర్పాట్లు చేసింది. అయితే, భక్తులు ముందుగానే టోకెన్ జారీ కేంద్రాల వద్దకు భారీగా తరలివచ్చారు.
ఈ క్రమంలో, తిరుపతిలోని శ్రీనివాసం, బైరాగిపట్టెడ, సత్యనారాయణపురం వద్ద ఉన్న టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తుల మధ్య భారీగా తోపులాట చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు సొమ్మసిల్లి పడిపోవడంతో వారిని తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. వారిలో చికిత్స పొందుతూ ఆరుగురు మృతి చెందారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నట్టు గుర్తించారు. ఈ ఘటనపై స్పందించిన అధికారులు ఘటన స్థలాలకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రాల వద్దకు అదనపు పోలీసు బలగాలను తరలించారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30శాతం రిబేటు

విజయవాడ,జనవరి8ఆంధ్ర ప్రగతి :రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్ అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థలలోను 30 శాతం ప్రత్యేక రాయితీ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడంతోపాటు, ఆప్కో వస్త్రాలను ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా తగ్గింపు ఇవ్వడం జరుగుతున్నదన్నారు. ఆప్కో షోరూమ్ లతోపాటు ఆ÷-లనైన్లోనూ మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత చీరలు, బెడ్ షీట్స్, లుంగిస్, టవల్స్ రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమకు చేయూత నందించాలని ఆప్కో మండల వాణిజ్యాధికారి డి. వెంకటేశ్వర్లు ఆ ప్రకటనలో కోరారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభుత్వ
తెలుగు దినపత్రిక

నీరుగారుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ లక్ష్యం

ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా తగ్గని పేదరికం - కేంద్ర, రాష్ట్రాల్ర తీరుతో మోసపోతున్న జనం

న్యూఢిలీ:
ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం నీరుగారింది. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా పేదరికం మాత్రం తగ్గడం లేదు. ఏటికేడు ఉచిత పథకాల రూపకల్పన దీనిని సూచిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో జనం మోసపోతున్నారు. పేదరికం పెరగడంతో రక్తహీనత, తల్లీబిడ్డల మరణాలు పెరిగిపోయాయి. దీంతో జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం మందికి సబ్సిడీ ధాన్యం అందివ్వాలని కేంద్రం నిర్ణయించింది. కరోనా సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 2020 జనవరి 1నుండి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఇంత కాలంగా ఆహార ధాన్యాల సబ్సిడీ అందిస్తున్న పేదరికం, ఆకలి బాధలు తగ్గకపోగా పెరిగాయి. ప్రపంచ ఆకలి సూచికలో 156 దేశాల్లో మన దేశం 110వ స్థానంలో ఉంది. సార్వత్రిక ప్రజా పంపిణీ విధానం అమలు చేయడం దీనికి కీలక పరిష్కారం అని సూచనలు వస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం తమ వ్యాపార, కంపెనీల ప్రయోజనాల కోసం ఆహార పంటల సాగును తగ్గించి, వాణిజ్య పంటలను బలవంతాన అమలు చేయించారు. చరిత్రలో ఎన్నడూ ఎరగని ఆకలి, కరువులతో కోట్ల మంది భారతీయులు చనిపోయారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఆహార పంటల అభివృద్ధికి కొన్ని

చర్యలు చేపట్టినా, ప్రజల ఆకలి బాధలను తీర్చలేకపోయింది. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు 1960వ దశకంలో చైనా, పాకిస్తాన్‌లతో వచ్చిన యుద్ధాలు ఆహారధాన్యాల సమస్యను మరింత తీవ్రం చేశాయి. తిండిగింజల కొరత పెరిగింది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ఆవిర్భవించింది. 1964లో ఆహారధాన్యాల కమిటీని ఏర్పాటు చేసి ఒకవైపు ఆహారధాన్యాల ధరల పెరుగుదలను, అక్రమ నిల్వలను అరికట్టడం, మరోవైపు పేదలకు తక్కువ ధరకు ఆహారధాన్యాలు అందించడం ప్రారంభించారు. హరిత విప్లవం తర్వాత 1970-80 మధ్య గిరిజన ప్రాంత ప్రజలకు, క్రమంగా గ్రామ, పట్టణ పేదలకు విస్తరించారు. 1992 జూన్ నుండి పునరుద్ధరించబడిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కరువు పీడిత ప్రాంతాలు, గిరిజన, ఎడారి ఉన్న 1775 ప్రాంతాల్లో ఈ పథకం ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించారు. 1977 నుండి లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీ ఆహార ధాన్యాలు అందించారు. దారిద్య రేఖకు దిగువన ఉన్న వారికి కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం, పేదల్లో మరింత పేదరికంలో వున్న వారికి 2002 నుండి అంత్యోదయ అన్న యోజన పథకం ద్వారా కటుంబానికి 35 కిలోలు ఇచ్చారు.
ఎన్.టి.రామారావు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన రేషన్ బియ్యం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ పథకాన్ని రద్దు చేయాలని ప్రయత్నించిన కాంగ్రెసు తర్వాతి కాలంలో రూపాయికే కిలో బియ్యం హామీ ఇవ్వాల్సి వచ్చింది. చంద్రబాబు ఈ బియ్యం పథకాన్ని కుదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. . వైసిపి పాలనలో ఇంటి వద్దకే బియ్యం అందించాల్సి వచ్చింది. ఇంత చేసినా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 54 శాతం మందికి మాత్రమే రేషన్ బియ్యం అందుతుంది. 2020 జనాభా ఆధారంగా చూస్తే 50 శాతం మందికి మాత్రమే అందుతుంది. బియ్యంతో పాటు, చక్కెర, కందిపప్పు, ఆయిల్, కిరోసిన్ లాంటి సరుకులు ఇవ్వాల్సి వుండగా బియ్యం మాత్రమే పంపిణీ అవుతుంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఉపాధితో జనం అల్లాడిపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న పాలకులు పేదలకు అవసరమైన కనీస నిత్యావసర సరుకులను మాత్రం ప్రజా పంపిణీ ద్వారా అందించడం లేదు. లక్షల టన్నుల ధాన్యం భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో మగ్గిపోతున్న పేదలకు ఎందుకు పంచడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా పాలకుల తీరు మారలేదు. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం రైతులను గట్టెక్కించే ప్రయత్నాలు చేయడం లేదు. దేశానికి సరిపడా తిండిగింజలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించడం లేదు. దేశ ఆహార భద్రతలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎఫ్‌సిఐ గోడౌన్లను మూసివేయడం లేదా ప్రైవేటీకరించడం ఈ ప్రభుత్వ విధానంగా కనిపిస్తోంది.గత 13 సంవత్సరాలుగా జనాభా లెక్కలు సేకరించకుండా 2011 లెక్కల ఆధారంగానే ప్రస్తుత ప్రజా పంపిణీ అమలు చేస్తున్నారు. ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు అంటూ ఈ పథకాన్ని కుదించడానికి అనేక ప్రయత్నాలు కేంద్రం చేస్తోంది. 2013-14లో ఆహార సబ్సిడీ కోసం దేశ స్థూల జాతీయోత్పత్తిలో 0.8 శాతం ఖర్చు చేస్తుండగా, 2019-20లో 0.5 శాతానికి తగ్గించివేశారు. కరోనా సమయంలో అనివార్యంగా 2021-22లో 1.2 శాతానికి పెంచి ఆ తర్వాత 2023-24లో 0.7 శాతానికి తగ్గించివేశారు. ఎఫ్.సి.ఐ ద్వారా ఇస్తున్న సబ్సిడీకి 2021-22లో రూ.2,08,929 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ. 1,37,207 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనివల్ల బియ్యం, గోధుమల సేకరణ తగ్గింది. 2015-16లో 342.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించగా, 2022-23లో 434.83 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇదే కాలంలో గోధుమల సేకరణ 57 శాతం తగ్గింది. ఇవన్నీ సమీక్షించి పక్కాగా పథకాలను అమలు చేయాల్సిన సమయం ఇది.

తిరుమలలో పూర్తికావచ్చిన వైకుఠ ఏకాదశి ఏర్పాట్లు

పదిరోజులపాటు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం -మహాకుంభమేళాలలో తిరుమల నమూనా ఆలయం

తిరుమల:
తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఇలవైకుంఠం తిరుమలలో ఏటా వైకుంఠ ఏకాదశికి భారీగా భక్తులు తరలివస్తారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 రోజులపాటు వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచుతామని, అందుకు తగిన భద్రతా చర్యలు చేపట్టామని టిటిడి ఈఓ శ్యామలా రావు ప్రకటించారు. మహాకుంభమేళలో టిటిడి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు జరగనుందని తెలిపారు. 2.89 ఎకరాల భూమి కుంభమేళా లో కేటాయించారని, అక్కడ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. శ్రీవారి ఆలయంలో జరిగే అన్నీ సేవలు, కైంకర్యాలు నమూనా ఆలయంలో నిర్వహిస్తామన్నారు. జనవరి 18, 26.. ఫిబ్రవరి 3, 26 తేదిలలో కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. తిరుమల నుండి కుంభమేళాకి కళ్యాణ రథం ప్రారంభించారు. ఇకపోతే వైకుంఠ ద్వార దర్శన టికెట్లు ఉన్న వారికే పది రోజుల పాటు దర్శనం, టికెట్లు లేకుంటే దర్శనం లేదు అని స్పష్టం చేశారు. పది రోజుల్లో 7 లక్షలమంది దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 9 న సర్వదర్శన టికెట్లు జారీ నిలిపివేస్తున్నామని తెలిపారు. సిఫార్సు లేఖలు రద్దు చేశామన్నారు. వసతి ఎవరు

ముందు వస్తే వారికే కేటాయిస్తామని చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 10న ఉదయం 4:30 గంటలకు విఐపీ దర్శనం ఉందన్నారు. 8:30 గంటలకు సామాన్య భక్తులు దర్శనం ఉంటుందన్నారు. ఏకాదశి నాడు స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుందన్నారు. 12 గంటలకు వాహన మండపంలో భక్తులు కోసం ఉత్సవమూర్తు లుంటారని తెలిపారు. ద్వాదశి నాడు శ్రీవారి పుష్కరిణి లో చక్రస్నానం ఉంటుందన్నారు. 9వ తేది ఉదయం 5 గంటలకు తిరుమల తిరుపతి లో 94 కౌంటర్ లో టోకెన్ లు కేటాయిస్తున్నామన్నారు. 10, 11, 12 తేదిలకు 9 తేది కేటాయింపులున్నాయన్నారు. తక్కిన రోజుల్లో ఏరోజుకారోజు మూడు ప్రదేశాలలో టోకెన్ కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ వైకుంఠ ద్వార దర్శన టికెట్లు కేటాయించామన్నారు. ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామన్నారు. 12 వేల వాహనాలకు వాహన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విఐపీలకు రాంభకిఛ వద్దే వాహనాలు అనుమతిస్తామన్నారు. భద్రత పై ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. టోకెన్ ఇచ్చే కేంద్రాల వద్ద విజిలెన్స్, పోలీసుల సహాయంతో ఏర్పాట్లు చేశామన్నారు. అన్న ప్రసాద కేంద్రం ఉదయం ఆరు గంటల నుండి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆలయంలో అలంకరణ ప్రత్యేక నిపుణులతో చేయిస్తున్నామన్నారు. మూడువేల శ్రీవారి సేవకుల సేవలు వాడుకుంటామని తెలిపారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వైకుంఠ ఏకాదశికి విఐపీల తాకిడి అధికంగా ఉన్న సందర్భంగా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు టికెట్ పైనే రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా తిరుమలలో రూట్ మ్యాప్ తెలుసుకోవచ్చునని చెప్పారు. మూడు వేలమందితో వైకుంఠ ఏకాదశి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

భారత భూభాగం ఆక్రమణ బంగ్లా కథనాలను తిప్పికొట్టిన బిఎస్ఎఫ్

న్యూఢిల్లీ,: భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా ఇరుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలు పెట్టారు.

స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్ : ఇస్రో కొత్త చీఫ్

తిరువనంతపురం, :
ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో





చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ద్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

మళ్లీ పెరిగిన బంగారం ధరలు

అమరావతి,: పుత్తడి ధర మరోమారు పెరిగింది..! వరుసగా మూడు రోజులు స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు బుధవారం మళ్లీ పెరిగాయి. 2024లో గోల్డ్ రన్ హై స్పీడ్‌లో సాగింది. ఈ 2025లో కూడా అంతకుమించి బంగారం పరుగులు తీస్తుందని వ్యాపారవేత్తలు అంటున్నారు. దేశీయ మార్కెట్లో రూ.90 వేలకు చేరే ఛాన్స్ ఉందంటున్నారు..! ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి పై రూ.100 పెరగగా, 24 క్యారెట్లపై రూ.110 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో బుధవారం (జనవరి 8) 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.72,250గా.. 24 క్యారెట్ల ధర రూ.78,820గా ఉంది. మరోవైపు నిన్న భారీగా పెరిగిన వెండి ధర నేడు స్థిరంగా ఉంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.92,500గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి రూ.లక్షగా కొనసాగుతోంది.

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ మూడవ ఎడిషన్‌కు సిద్ధం

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండు సీజన్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ఇది మూడవ ఎడిషన్‌కు సిద్ధమైంది. 2025 కోసం వేలం ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు టోర్నీ ప్రారంభం కావడమే ఆలస్యం. వేలం తర్వాత, బీసీసీఐ కూడా డబ్ల్యూపీఎల్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తాజా నివేదిక ప్రకారం, ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 6 లేదా 7 నుంచి ప్రారంభమవుతుంది. ఈసారి బరోడా, లక్నోలలో మ్యాచ్‌లు ఆడవచ్చు. అయితే తేదీ, వేదికపై బీసీసీఐ ఇంకా ఎలాంటి అధికారిక సమాచారాన్ని పంచుకోలేదు. బీసీసీఐ, డబ్ల్యూపీఎల్ మూడవ సీజన్ కోసం బరోడా, లక్నోలను షార్ట్‌లిస్ట్ చేసింది. టోర్నీని నిర్వహించేందుకు యూపీ క్రికెట్ అసోసియేషన్, బరోడా క్రికెట్ అసోసియేషన్‌తో చర్చలు ప్రారంభించింది. త్వరలో ఈ రెండు నగరాలను కూడా భారత బోర్డు అధికారికంగా వేదికలుగా ప్రకటించనుంది. నివేదిక ప్రకారం, డబ్ల్యూపీఎల్ రెండవ దశ బరోడాలో ప్లాన్ చేసింది. టోర్నమెంట్ చివరి మ్యాచ్ మార్చి 8 లేదా 9 న ఆడవచ్చు. బరోడా దీనికి ఆతిథ్యం ఇవ్వవచ్చు. బరోడా ఇటీవల కోటంబి స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పించింది. ఆ తర్వాత ఈ మైదానంలో భారత్, వెస్టిండీస్ మహిళల జట్లు 3 వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఇది కాకుండా, సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో చాలా మ్యాచ్‌లు కూడా ఈ మైదానంలో జరిగాయి. కొన్ని రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు కూడా జరిగాయి. ఇప్పుడు భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ కొన్ని నాకౌట్ మ్యాచ్‌లు కూడా ఆతిథ్యం ఇచ్చింది. కొత్త సౌకర్యాలను పరీక్షించడానికి, విజయ్ హజారే ట్రోఫీ సెమీ-ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను కూడా బరోడాలో నిర్వహించవచ్చు. అందుకే ఇప్పుడు బీసీసీఐ దీన్ని డబ్ల్యూపీఎల్ వేదికగా ఎంపిక చేసింది. డబ్ల్యూపీఎల్ 2025లో, టోర్నమెంట్‌లోని 5 జట్లు ఛాంపియన్‌లు కావాలనే ఉద్దేశ్యంతో ప్రవేశిస్తాయి. గత ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉంది. బెంగళూరు తన టైటిల్‌ను తిరిగి పొందాలనుకుంటున్నది. అయితే, ఇతర జట్లు ఈ టైటిల్‌ను గెలుచుకోవాలనుకుంటున్నాయి. ఇందుకోసం రెండు దశల్లో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో మిగిలిన పనిని పూర్తి చేయడానికి కొంత సమయం కావాలి. కాబట్టి, రెండవ దశను నిర్వహించాలని బీసీసీఐని కోరింది. టోర్నమెంట్ మొదటి సీజన్ పూర్తిగా ముంబైలో ఆడింది. రెండో సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీలో మ్యాచ్‌లు జరిగాయి.

ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి సన్నాహాలు

36 మంది ఆటగాళ్ల జాబితా సిద్ధం!

బీసీసీఐ సెలక్షన్ కమిటీ తీవ్ర కసరత్తు

ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీకి సంబంధించిన అన్ని జట్లను జనవరి 12లోగా ప్రకటించేందుకు ఐసీసీ గడువు విధించింది. ఈ గడువు ముగిసిన తర్వాత బీసీసీఐ సెలక్షన్ కమిటీ 36 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ 36 మంది ఆటగాళ్ల జాబితా నుంచి 15 మందిని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేస్తారు. కాబట్టి, 21 మంది ఆటగాళ్లు తప్పుకోవడం ఖాయం. అయితే, కొంత మంది ఆటగాళ్లను రిజర్వ్ జాబితాకు ఎంపిక చేసే అవకాశాలను తోసిపుచ్చలేం. రోహిత్ శర్మ (కెప్టెన్), శుభమన్ గిల్, జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ. ఐదుగురు స్టార్టర్స్‌తో కూడిన ఈ జాబితా నుంచి ముగ్గురు ఓపెనర్లు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, ర్యాన్ పరాగ్, రజత్ పాటిదార్, తిలక్ వర్మ, సాయి సుదర్శన్, రింకు సింగ్ లను మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్స్ గా తీసుకునే అవకాశం ఉంది. ఆల్ రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే లకు చాన్స్ దొరకవచ్చు. కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి పూర్తి స్థాయి స్పిన్నర్లలో ఉన్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేష్ ఖాన్, హర్షిత్ రాణా, పర్షిద్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, మహ్మద్ షమీలు ఫాస్ట్ బౌలర్ల జాబితాలో చోటు లభించే అవకాశం ఉంది.

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు రోహిత్‌కు విశ్రాంతి!!

గిల్‌కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించే అవకాశం

ఆస్ట్రేలియాలో ఘోర పరాజయాన్ని మరచిపోయిన టీమిండియా ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌పై కన్నేసింది. జనవరి 22 నుంచి ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సమయంలో జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ భాగం కావడం లేదని, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, రోహిత్ శర్మ ఆడకపోతే వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించేందుకు జనవరి 12వ తేదీని ఐసీసీ డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్ సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా బీసీసీఐ జట్టును ప్రకటించవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ ఆడడం ఖాయం. కానీ, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో మాత్రం అతను పాల్గొనడం ఖాయం. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్ ఈ సిరీస్‌లో ఆడకపోతే, కెప్టెన్సీకి శుభ్‌మన్ గిల్ అతిపెద్ద పోటీదారుగా మారబోతున్నాడు. ఎందుకంటే, ఈ సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయం.

రిటైర్మెంట్ ప్రకటించిన ఫుట్ బాల్ స్టార్ నేమార్

ఫిఫా 2026 వరల్డ్ కప్ చివరి టోర్నీ అని వెల్లడి

బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. తాను రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించాడు. ఫిఫా 2026 వరల్డ్ కప్ తాను ఆడబోయే చివరి టోర్నీ అని అన్నాడు. అలానే దిగ్గజ ఫుట్ బాలర్స్ మెస్సీ, సూరెజ్ తో రీయూనియన్ విషయమై హింట్ ఇచ్చాడు. 79 గోల్స్ తో బ్రెజిల్ ఆల్ టైమ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు నేమార్. అయితే 32 ఏళ్ల నేమార్ కెరీర్ లో ఎన్ని ఘనతలు సాధించాడో, అలానే గాయాల బారిన కూడా పడ్డాడు. దీంతో ఈ మధ్య కాలంలో చాలా తక్కువ మ్యాచులలోనే బరిలోకి దిగాడు. 2023లో పారిస్ సెయింట్ జెర్మెన్ నుంచి బయటకొచ్చిన కేవలం ఏడు మ్యాచులలోనే ఆడాడు. సౌదీ ప్రో లీగ్ క్లబ్ వారితో అతడి కాంట్రాక్ట్ 2024 జూన్ తో ముగిసిపోయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు నేమార్ తన కెరీర్ భవిష్యత్ ప్రణాళిక గురించి హింట్ ఇచ్చాడు. రిటైర్మెంట్ గురించి కూడా వ్యాఖ్యలు చేసాడు. మేజర్ లీగ్ సాసర్ బరిలో దిగడంతో పాటు మాజీ బార్సిలోనా టీమ్ మేట్స్ లియోనెల్ మెస్సీ, లూయిస్ సూపెజ్ తో రీయూనియన్ అయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. "నేను ఆడేందుకు ప్రయత్నిస్తాను. కచ్చితంగా ఆడుతాను. నా నేషనల్ టీమ్ కోసం, జట్టుతో ఉండేందుకు చేయాల్సినవన్నీ చేస్తాను. ఇక ఇదే నా చివరి వరల్డ్ కప్. నా లాస్ట్ షాట్, నా లాస్ట్ ఛాన్స్ ఇదే. కాబట్టి నేను ఈ ప్రపంచ కప్ లో ఆడేందుకు ఏదైనా చేస్తాను." అని పేర్కొన్నాడు. నేమార్ , మెస్సీ, లూయిస్.. గతంలో ఈ త్రయం కలిసి అద్భుత రికార్డులను సాధించారు. వీరి మధ్య మంచి స్నేహబంధం కూడా ఉంది. తాజాగా వారితో రీయూనియన్ గురించి నేమార్ మాట్లాడుతూ... "మెస్సీ, లూయిస్ తో కలిసి మళ్లీ ఆడటం అనేది అసాధరణమైన విషయం. వాళ్లు నా స్నేహితులు. మేం ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నాం. నేను అల్ హిలాల్, సౌదీ అరేబియాతో హ్యాపీగానే ఉన్నాను. ఫుల్ బాల్ అంటేనే ఎన్నో సర్ ప్రైజెస్." అని చెప్పుకొచ్చాడు. కాగా, బ్రెజిల్ జట్టు ప్రస్తుతం సౌత్ అమెరికన్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ లో ఐదో స్థానంలో ఉంది.

హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్న తీక్షణ

ఏడో శ్రీలంక బౌలర్‌గా రికార్డు

శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ చరిత్ర సృష్టించాడు. వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ వికెట్ సాధించిన ఏడో శ్రీలంక బౌలర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం హామిల్టన్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో తీక్షణ ఈ ఫీట్ సాధించాడు. వర్షం అంతరాయం కలిగిన ఈ మ్యాచ్‌లో తీక్షణ రెండు ఓవర్ల సాయంతో హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. వరుసగా మూడు బంతుల్లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ స్టార్క్, నాథన్ స్మిత్, మ్యాట్ హెన్రీలను ఔట్ చేశాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 35వ ఓవర్ చివరి రెండు బంతులకు మిచెల్ సాంట్నర్, నాథన్ స్మిత్‌లను ఔట్ చేసిన తీక్షణ.. 37వ ఓవర్ తొలి బంతికి మ్యాట్ హెన్రీని పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. తీక్షణ కంటే ముందు శ్రీలంక తరఫున చమింద వాస్(2001, 2003),లసిత్ మలింగా(2007), ఫర్వేజ్ మహరూఫ్(2007), లసిత్ మలింగా(2011), తిసారా పెరెరా(2012), వానిందు హసరంగా(2017), దుష్మంత్ మధుషంక(2018)లు వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 ఓవర్లు బౌలింగ్ చేసిన తీక్షణ 44 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. తీక్షణ హ్యాట్రిక్ తీసిన ఈ మ్యాచ్‌లో శ్రీలంకకు పరాజయం తప్పలేదు. 113 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 9 వికెట్లకు 255 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర(63 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 79), మార్క్ ఛాప్‌మన్(52 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) హాఫ్ సెంచరీలతో రాణించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

చీరకట్టులో అందాల రాక్షసి

'అందాల రాక్షసి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న లావణ్య, తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె కెరీర్ ప్రారంభంలోనే వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించడంలో సక్సెస్ అయ్యారు. ఇక తాజాగా తన ట్రెడిషనల్ లుక్‌తో మళ్లీ సోషల్ మీడియాలో హీటెక్కించిన విధానం వైరల్ అవుతోంది.పీచ్ కలర్ చీరలో మెల్లగా మెరిసిపోతూ కనిపించిన లావణ్య ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో ఆమె అందం అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ లుక్‌లో సింప్లిసిటీకి గ్లామర్ జోడించి తనదైన స్టైల్‌ను చూపించారు. లావణ్య త్రిపాఠి తన డ్రెస్సింగ్ చాయిస్‌తో ఎల్లప్పుడూ ప్రత్యేకమై నిలుస్తారు, ఈ సారి కూడా అదే ప్రూవ్ అయ్యింది. మెకప్ చాలా సాఫ్ట్‌గా ఉండగా, ఆమె సొగసైన జడ ధరించిన చెవిపోగులు, హుందాతనానికి తార్కాణంగా నిలిచాయి. అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ తగ్గడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో లావణ్య తరచుగా తన అందాలను మెరిపిస్తూ, ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తుంటారు. ఇటీవలనే ఆమె మెగా ఫ్యామిలీ కోడలిగా మారి కొత్త జీవితంలో అడుగు పెట్టారు. ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను సమన్వయం చేస్తూ కెరీర్‌లో మరో హిట్ కోసం సిద్ధమవుతున్నారు. ఆమె గత చిత్రాల విషయానికి వస్తే, 'మిస్టర్,' 'సోగ్గాడే చిన్ని నాయన,' 'భలే భలే మగాడివోయ్' వంటి బ్లాక్ బస్టర్స్ ఆమె కెరీర్‌కు మంచి బూస్ట్ ఇచ్చాయి. ప్రస్తుతం 'సతీ లీలావతి' అనే ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఆమెకు మరింత గుర్తింపు తీసుకొస్తుందని సినీ వర్గాలు ఆశిస్తున్నాయి. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకున్న లావణ్య, పలు భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ట్రెడిషనల్ లుక్‌తో అలా మెరిసిపోయిన ఈ ఫోటోలు, మరోసారి ఆమె తన అందాన్ని ఎలా ప్రదర్శించాలో చూపిస్తున్నాయి. 'సతీ లీలావతి'తో మరోసారి ప్రేక్షకులను మెప్పించే పనిలో ఉన్న లావణ్య త్రిపాఠి, ఫ్యాన్స్‌ను మరింతగా ఆకట్టుకుంటారనే ఆశాభావం ఉంది. చూడాలి మరి అమ్మడు ఎంతవరకు సక్సెస్



కేజీఎఫ్ తరువాత మరోసారి
వైల్డ్ లుక్‌లో యష్

'కేజీఎఫ్, కేజీఎఫ్-2 చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకున్న కన్నడ కథానాయకుడు యష్. 'కేజీఎఫ్'లో ఆయన మాస్ లుక్‌కు, మాస్ అవతార్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. కేజీఎఫ్-2 తరువాత మరో సినిమా అంగీకరించడానికి చాలా సమయం తీసుకున్నారు యష్. తాజాగా ఆయన నటిస్తున్న చిత్రం 'టాక్సిక్'. పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రాన్ని గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. కాగా నేడు జనవరి 8న హీరో యష్ బర్త్‌డే సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆయన లుక్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్ నుంచి బర్త్‌డే పీక్ అంటూ యష్ బర్త్‌డే ట్రీట్‌ను వదిలారు నిర్మాతలు.
గ్లింప్స్ చూస్తుంటే బోల్డ్ కంటెంట్‌తో హాట్‌గా ఉంది. చిత్రం ప్రేక్షకుల అంచనాలకు మించి ఉండబోతుందని, కొత్తదనం కోసం తపించే యష్ ఈ చిత్రంలో ఎంతో డిఫరెంట్‌గా, మోర్ మాసివ్‌గా కనిపించబోతున్నాడని అంటోంది చిత్ర యూనిట్. భారీ ఖర్చుతో, ప్రముఖ తారాగణంతో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రేక్షకులు ఎన్నో షాకింగ్ అంశాలను చూస్తారని, వారికి సరికొత్త అనుభూతిని పంచే చిత్రంగా ఇది ఉండబోతుందని దర్శకురాలు గీతు మోహన్‌దాస్ చెబుతున్నారు

మినిస్టర్ నారా లోకేష్ గెస్ట్‌గా
డాకు మహారాజ్ ఈవెంట్..!

నందమూరి బాలకృష్ణ బాబీ కాంబో లో వస్తున్న డాకు మహారాజ్ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ అవుతుంది. సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ లో సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా భారీ బడ్జెట్ తో నిర్మించారు. థమన్ సంగీతం అందించిన ఈ మూవీలో ప్రగ్యా జైశ్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశి రౌతెలా హీరోయిన్స్ గా నటించారు. సినిమా నుంచి ఇప్పటివరకు రిలీజ్ అయిన ప్రోమోస్ అన్ని అదిరిపోయాయి డాకు మహారాజ్ కోసం ఈమధ్యనే దల్లాస్ లో ఒక స్పెషల్ ఈవెంట్ నిర్వహించారు. అక్కడ ఉన్న నందమూరి ఫ్యాన్స్ అందరు ఈ ఈవెంట్ లో సూపర్ ఎంజాయ్ చేశారు. ఇక ఇప్పుడు మన దగ్గర ప్రీ రిలీజ్ ఈవెంట్ వెన్యూ ఇంకా టైమ్ ఫిక్స్ చేశారు. ఈసారి డాకు మహారాజ్ ఈవెంట్ రాయలసీమ లో చేస్తున్నారు. బాలకృష్ణ సినిమాలకు అక్కడ సూపర్ క్రేజ్ ఉంటుంది.. బాలయ్య చేసే యాక్షన్ సినిమాలకు అక్కడ ఒక రేంజ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. అందుకే ఈసారి అనంతపురం లో డాకు మహారాజ్ ఈవెంట్ ని ప్లాన్ చేశారు. జనవరి 9 సాయంత్రం 5 గంటలకు అనంతపురం శ్రీ నగర్ కాలనీ లో ఈ ఈవెంట్ జరగనుంది. ఈ ఈవెంట్ కి ఛీఫ్ గెస్ట్ గా నారా వారసుడు బాలకృష్ణ అల్లుడు ఆంధ్రప్రదేశ్ మినిస్టర్ నారా లోకేష్ అటెండ్ అవుతున్నారు.. దీనికి సంబందించిన అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. బాలయ్య సినిమా ఈవెంట్ కి మినిస్టర్ లోకేష్ గెస్ట్ గా రావడం సంథింగ్ స్పెషల్ అని చెప్పొచ్చు. ఈ వేదిక మీద మామ బాలకృష్ణ గురించి మినిస్టర్ అల్లుడు నారా లోకేష్ ఏం మాట్లాడుతారన్నది ఆసక్తి కరంగా మారింది. డాకు మహారాజ్ టీమ్ మాత్రం ఈ ఈవెంట్ ని చాలా స్పెషల్ గా ప్లాన్ చేస్తున్నారు. అంతేకాదు ఫ్యాన్స్ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవెంట్ లో అటు బాలయ్య ఇటు లోకేష్ మామ అల్లుళ్ల హంగామాతో నందమూరి ఫ్యాన్స్ కి పండుగే అని చెప్పొచ్చు. బాలయ్య కెరీర్ లోనే హయ్యెస్ట్ బిజినెస్ చేసిన డాకు మహారాజ్ మీద భారీ హోప్స్ ఉన్నాయి. మరి సినిమా ఏం చేస్తుంది అన్నది చూడాలి.ఫ్యాన్స్ మాత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్ డాకు మహారాజే అని ఫిక్స్ అయ్యారు

మహిళ చనిపోయిన విషయం తెలిసి ఎంతో బాధపడ్డ :నిహారిక

'పుష్ప2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడు హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సినీనటి నిహారిక తొలిసారి స్పందించారు. ఇలాంటి ఘటనలుఎవరి ప్రమేయం లేకుండానే జరిగిపోతుంటాయని నిహారిక చెప్పారు. మహిళ చనిపోయిన విషయం తెలిసి ఎంతో బాధపడ్డానని అన్నారు. అందరి మద్దతుతో అల్లు అర్జున్ ఆ బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడని చెప్పారు. తన తాజా చిత్రం 'మద్రాస్ కారన్' ప్రమోషన్స్ లో భాగంగా మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితాలకు సంబంధించి కుటుంబ సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుంటుంటానని నిహారిక చెప్పారు. కథల ఎంపికలో గందరగోళానికి గురైనప్పుడు అన్న వరుణ్ తేజ్ ను సంప్రదిస్తానని తెలిపారు. రామ్ చరణ్ అన్నతో ఎంతో సరదాగా ఉంటానని చెప్పారు. లుక్స్ విషయంలో అల్లు అర్జున్ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి సినిమాకు ఆయన స్టైల్ మారుస్తుంటారని చెప్పారు. మరోవైపు నిహారిక హీరోయిన్ గా నటించిన 'మద్రాస్ కారన్' సినిమా ఈ నెల 10న విడుదల కానుంది.



సోషల్ మీడియా వేదికగా తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ సినీ నటి హనీరోజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు ఎర్రాకులం పోలీసులు 27 మందిపై కేసు నమోదు చేశారు. ఒక వ్యక్తి తనను ఉద్దేశపూర్వకంగా డబుల్ మీనింగ్ కామెంట్స్ చేస్తూ అవమానిస్తున్నాడని హనీరోజ్ తెలిపింది. అతను ఓ బిజినెస్ మేన్ (బాబీ చెమ్మనూరు) అని చెప్పింది. గతంలో కొన్ని కార్యక్రమాలకు తనను ఆహ్వానించాడని... అయితే ఇతర కారణాల వల్ల తాను వెళ్లలేదని... దీంతో తనపై ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపింది. తాను హాజరయ్యే ప్రతి ఈవెంట్ కు రావడం... వీలు కుదిరినప్పుడు కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం చేస్తున్నాడని చెప్పింది. అసభ్యకరంగా చేసే కామెంట్లను తాను సహించలేనని... అందుకే తాను పోలీసులను ఆశ్రయించానని తెలిపింది. మరోవైపు, హనీరోజ్ ఫిర్యాదు మేరకు బాబీ చెమ్మనూరును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా హనీరోజ్ స్పందిస్తూ... తనకు ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ విషయాన్ని తాను ఇప్పటికే సీఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లానని... నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తనకు మాట ఇచ్చారని వెల్లడించింది.

హీరోయిన్ హనీరోజ్ పై లైంగిక వేధింపులు.. వ్యాపారవేత్త అరెస్ట్

హీరో విశాల్ ఆరోగ్యంపై ఫుల్ క్లారిటీ ఇచ్చిన సినీ నటి ఖుష్బూ

తమిళ స్టార్ హీరో విశాల్ కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'మదగదరాజ' సినిమా ఈవెంట్ లో ఆయన వణుకుతూ కనిపించారు. దీంతో, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నారని టీమ్ చెప్పినప్పటికీ... ఆయన ఆరోగ్యం గురించి అభిమానులు వాకబు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో విశాల్ ఆరోగ్యం గురించి సీనియర్ నటి ఖుష్బూ క్లారిటీ ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... విశాల్ ఢిల్లీలో ఉన్నప్పుడే ఆయనకు జ్వరం వచ్చిందని తెలిపారు. 'మదగదరాజ' సినిమా 11 ఏళ్ల తర్వాత రిలీజ్ అవుతోందని... అందుకే అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఈవెంట్ కు వచ్చారని వెల్లడించారు. 103 డిగ్రీల జ్వరంతో విశాల్ వణికిపోయాడని ఖుష్బూ తెలిపారు. ఇంత జ్వరంతో ఎందుకు వచ్చావని తాను అడిగితే... 11 ఏళ్ల తర్వాత ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందని, అందుకే కచ్చితంగా రావాలనుకున్నానని చెప్పాడని వెల్లడించారు. ఈవెంట్ పూర్తికాగానే విశాల్ ను ఆసుపత్రికి తీసుకెళ్లామని... ఆయన ఇప్పుడు కోలుకుంటున్నాడని తెలిపారు. ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ సినిమా కోసం విశాల్ ఎంతో కష్టపడ్డాడని కితాబునిచ్చారు. విశాల్, తాను కలిసి పని చేయలేదని... కానీ ఇద్దరం ఎంతో ఆత్మీయంగా ఉంటామని ఖుష్బూ తెలిపారు. తొలిసారి తామిద్దరం ఒక పార్టీలో కలిశామని... ఆ తర్వాత ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందని చెప్పారు. విశాల్ చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్ అని... ఆయన నటించిన కొన్ని సినిమాలు తనకు ఎంతో ఇష్టమని అన్నారు. మిగతా హీరోలను తాను 'మీరు' అని సంబోధిస్తానని... కానీ విశాల్ తో మాత్రం సరదాగా మాట్లాడతానని చెప్పారు. విశాల్ హీరోగా, వరలక్ష్మి శరత్ కుమార్, అంజలి హీరోయిన్లుగా 'మదగదరాజ' సినిమా తెరకెక్కింది. ఈ సినిమాకు ఖుష్బూ భర్త సుందర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల తర్వాత ఈ నెల 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది.